KANCHARLA
# మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## రాయలసీమ

| | | |
|---|---|---|
| చిత్తూరు | అన్నమయ్య | అనంతపురం |
| కర్నూలు | కడప | నెల్లూరు |

శనివారం 17 సెప్టెంబర్ 2026 పేజీలు 16



# చిత్తూరు జిల్లాలో 27 మండలాల్లో ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు

- మండలాల వారీగా తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్ల నియామకం
- జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, అక్టోబర్ 16 (మనసు లో మాట):**
చిత్తూరు జిల్లాలో రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు-2026తో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్-ఎంసీసీ) అమలును పర్యవేక్షించేందుకు 27 మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవాడ వారు 2026 అక్టోబర్ 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించారు. అలాగే పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూళ్లు కూడా ప్రకటించారు.

..మిగతా 2లో



3

# దుత్తలూరులో గంజాయి సాగుపై పోలీసుల మెరుపు దాడి

# జనసేనలోకి 200 కుటుంబాలు చేరిక

- అతికారి కృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువత, కుటుంబాలు

5





5

## స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- తొలిరోజు నెల్లూరు మేయర్ స్థానానికి నిల్..
- వైఎస్సార్‌సీపీ తరఫున రెండు వార్డు నామినేషన్లు
- బుచ్చిరెడ్డిపాలెంలో చైర్‌పర్సన్ స్థానానికి ఒక నామినేషన్.. ఆత్మకూరులో నిల్

**నెల్లూరు, ప్రతినిధి, అక్టోబర్ 16, మనసులో మాట:**
జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు మున్సిపాలిటీ ల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. నగరపాలక సంస్థ మేయర్ స్థానానికి తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు



4

# సరస్వతీ దేవి అలంకరణలో కొలువుదీరిన వాసవి మాత!



# నెల్లూరు కార్పొరేషన్‌లో కూటమి క్లీన్‌స్వీప్ ఖాయం

6

- వైసీపీ అరాచకాలకు పాల్పడితే సహించేది లేదు.. టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

మనసులో మాట

# మదనపల్లె వైకాపా జడ్పిటీసీ అభ్యర్థినిగా కిరణ్మయి బరిలోకి



- వీరికి మెండుగా పార్టీ అధిష్టానం అండ

**మదనపల్లె, అక్టోబర్ 16 (మనసులో మాట) :**
మదనపల్లె వైకాపా జడ్పిటీసీ అభ్యర్థినిగా జేన్నే శేషాచలపతి నాయుడు భార్య కిరణ్మయి బరిలో నిలిచారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది.దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సందడి మొదలైంది. మదనపల్లి జడ్పిటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించారు.ఈ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి.ఇందులో భాగంగా వైఎస్సార్సిపి మదనపల్లి జడ్పిటీసీ అభ్యర్థినిగా బిసి కమిషన్ మాజీ సభ్యులు,వైసీపీ యువనాయకులు జేన్నే శేషాచలపతి నాయుడు భార్య కిరణ్మయిని పార్టీ అధిష్టానం దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది.మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి,మాజీ ఎమెల్యే డాక్టర్ తిప్పారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ సురేష్ కుమార్ రెడ్డి,మదనపల్లి నియోజక వర్గ వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,వైసీపీ ముఖ్య నాయకుల మద్దతుతో జడ్పిటీసీగా కిరణ్మయి పోటీలో దిగుతున్నారు.పాలఏకరి సామాజ వర్గానికి చెందిన శేషాచలపతి నాయుడు వైయస్సార్సీపిలో ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్నారు.వైసీపీ ప్రభుత్వంలో ఎంతో కీలకమైన బీసీ కమిషన్ సభ్యులుగా పనిచేశారు.బీసీల అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.విద్యావంతురాలైన తన భార్య కిరణ్మయి గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ సభ్యురాలుగా పనిచేశారు.

**కిరణ్మయి రాజకీయ నేపథ్యం**
పాలఏకరి సామాజవర్గానికి చెందిన కిరణ్మయి ఉన్నత విద్యావంతురాలు.గత వైసీపి ప్రభుత్వంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ సభ్యురాలిగా పనిచేశారు.సామాన్యుల కోసం నిరంతరం పనిచేయడం ఆమె నైజం.మదనపల్లి మండలంలో ఎక్కువగా బీసీ సామాజిక వర్గం ఓటర్లు ఉంటున్నారు.అన్ని సామాజిక వర్గాలు వారు శేషాచలపతి నాయుడు భార్య కిరణ్మయికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఒక అవకాశం కల్పిస్తే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని,మండల అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని జన్నే శేషాచలపతి నాయుడు,కిరణ్మయి దంపతులు పేర్కొన్నారు.ముఖ్య నాయకులు,కార్యకర్తల మద్దతు ఇవ్వాలని,ఓటర్లు ఆశీర్వదించాలని కోరుతున్నారు.

# విద్యాలక్ష్మీగా ఆదిలక్ష్మి

**రాపూరు అక్టోబర్ 16 (మనసులోమాట) :**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన, పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నృరిసింహ స్వామి, పట్టమహిషి అయిన ఆదిలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఆదిలక్ష్మి అమ్మవారు, విద్యాలక్ష్మి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారిని ఉత్సవమూర్తిని కొలువుదీర్చ, వేదపండితుల మంత్రోత్సారణ నడుమ పాలు, పెరుగు, తేనె, శుద్దిజలాలు, కొబ్బరిజలం, పంచాంమృతాలతో నవకలశ స్నపనం నిర్వహించారు. సాయంత్రం ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, పట్టువస్త్రములు సమర్పణ, అనంతరం ఆదిలక్ష్మి అమ్మవారిని పద్మపీఠంపై కొలువుదీర్చ విద్యాలక్ష్మీగా అలంకరించి, వేదపండితులు శాస్త్రోక్తంగా ఆస్థానము నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు.



# చిత్తూరు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు 27 మండలాల్లో ప్రత్యేక బృందాల ఏర్పాటు

- మండలాల వారీగా తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్ల నియామకం
- జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, అక్టోబర్ 16 (మనసు లో మాట):**
చిత్తూరు జిల్లాలో రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు-2026తో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్-ఎంసీసీ) అమలును పర్యవేక్షించేందుకు 27 మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవాడ వారు 2026 అక్టోబర్ 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించారు. అలాగే పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూళ్లు కూడా ప్రకటించారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని, రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇది అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును మండలాల వారీగా పర్యవేక్షించేందుకు తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లతో ప్రత్యేక బృందాలను నియమించారు. ఎన్నికల సమయంలో నిబంధనల అమలును పర్యవేక్షించడం, సంబంధిత అధికారుల సమన్వయంతో విధులు నిర్వహించడం ఈ బృందాల బాధ్యతగా ఉంటుంది.

**జిల్లాలోని మండలాల వారీగా నియమితులైన అధికారులు**
జిల్లాలోని బైరెడ్డిపల్లి మండలానికి ఎం.ఎస్. ప్రసన్న కుమార్, బంగారుపాళ్యం మండలానికి ఎస్. షబ్బీర్ బాషా, చిత్తూరు మండలానికి బి. కల్యాణి, గంగాధర నెల్లూరు మండలానికి సి.కె. శ్రీనివాసులు, గంగవరం మండలానికి పి. రేఖ, గుడిపాల మండలానికి పూజారి శ్రీనివాసులు, గుడుపల్లి మండలానికి టి. సీతారాం, ఐరాల మండలానికి ఎ. రామకృష్ణ, కార్వేటినగరం మండలానికి కె. నాగరాజు, కుప్పం మండలానికి పి. రమేష్ బాబులను ఎంసీసీ బృందాల తహసీల్దారు సభ్యులుగా నియమించారు. అదేవిధంగా నగరి మండలానికి డి. రవి కుమార్, నింద్ర మండలానికి ఎం. ఈశ్వర్ బాబు, పలమనేరు మండలానికి ఆర్. రమేష్ రెడ్డి, పలసముద్రం మండలానికి ఎన్.ఎం. గుర్రప్ప, పెద్దపంజాణి మండలానికి జి. రామమూర్తి, పెనుమూరు మండలానికి ఎం. లోకేశ్వరి, పులిచెర్ల మండలానికి ఆర్. జయసింహ, పూతలపట్టు మండలానికి శ్రీ వి. ఉదయ్ సంతోష్, రామకుప్పం మండలానికి బి. కౌశలే, రొంపిచెర్ల మండలానికి పి. కిరణ్ కుమార్, ఎస్.ఆర్.పురం మండలానికి ఎస్. లోకనాథ పిళ్లైలను నియమించారు. మిగిలిన మండలాలైన శాంతిపురానికి ఎం. ప్రకాష్ బాబు, తవణంపల్లికి ఎస్. మాధవరాజు, వి.కోటకు బి. సూర్య ప్రకాష్ నాయక్, వెదురుకుప్పానికి కె. బాబు, విజయపురానికి జె. ముని శైలజ, యాదమరికి జి.పి. పార్థసారథిలను సంబంధిత బృందాల తహసీల్దారు సభ్యులుగా నియమించారు.



**పోలీసు, వీడియోగ్రఫీ సిబ్బందితో సమన్వయం**
ప్రతి మండలానికి సంబంధించి ఉత్తర్వుల్లో పేర్కొన్న పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లను కూడా ప్రత్యేక బృందాల్లో భాగంగా నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వుల ప్రతులను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) ద్వారా నియమిత అధికారులకు పంపించాలని, వారు తమకు కేటాయించిన విధులను నిర్వహించి, విధి నిర్వహణకు సంబంధించిన ఉత్తర్వుల అందిన ప్రతులను జిల్లా కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అలాగే చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి, చిత్తూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్, చిత్తూరు, పుత్తూరు, కుప్పం సబ్ డివిజన్ల పోలీసు అధికారులు, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా తహసీల్దార్లకు ఈ ఉత్తర్వుల ప్రతులను పంపించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని, సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీ సుమిత్ కుమార్ పై ప్రకటనలో తెలిపారు.

# అన్ని దానాలలో కెల్లా నేత్రదానం గొప్పది

**వాకాడు మనసులో మాట అక్టోబర్ 16.**
అన్ని దానాలలో కెల్లా నేత్రదానం గొప్పదని ఎం. వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ అన్నారు.శుక్రవారం కోట పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంబించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు లీలా మోహన్ కృష్ణ మాట్లాడుతూ.ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం, పురస్కరించుకొని ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.స్థానిక గిరిజన కాలనీలో నివసిస్తున్న వృద్ధులకు కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి వారిలో దృష్టిలోపమే కాక కంటిలో శుక్లాలు ఉన్న వారిని గుర్తించి వారిని వాసన్ ఐ కేర్ ఆస్పత్రి నందు ఉచితంగా వారి కి కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అంగనవాడి కేంద్రంలో ఉన్న పిల్లలకు పలకలు అందజేసి వారిచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.తదుపరి అంగనవాడి కేంద్రంలో ఉన్న కిషోర్ బాలికలకు పౌష్టికాహారాన్ని అందజేశారు.గిరిజన కాలనీలో నివసించే నిరుపేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఎం వి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు గూడూరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఎంవి రావు ఫౌండేషన్ ద్వారా సేవ కార్యక్రమాలు అందిస్తూ ప్రజల నుండి మన్ననలు అందుకుంటుందని ఆ సంస్థ చైర్మన్ లీలా మోహన్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ కార్యదర్శి ఎం విజయ లక్ష్మి గిరిజన కాలనీవాసులు పాల్గొన్నారు.







# ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో టిడిపిలో చేరిన వైసిపి మాజీ కౌన్సిలర్లు

**మదనపల్లె,అక్టోబర్ 16 (మనసులో మాట ) :**

మున్సిపల్ పోరు మొదలు కావడంతో అధికార పార్టీలోకి వైసిపి నుండి చేరికలు ఊపందుకున్నాయి. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష ఆధ్వర్యంలో శుక్రవారం వైసిపి పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లు షరీఫ్, క్రిస్టియన్ మైనార్టీ నేత రాజశ్యాం తన స్నేహితులు,అనుచరులతో కలిసి ఎమ్మెల్యే షాజహాన్ బాషా నివాసంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్లతో పాటు ఇతర నేతలకు కండువాలు తప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక పోరు మొదలైన నేపథ్యంలో ప్రముఖ క్రిస్టియన్ నేత రాజశ్యామ్, ముస్లిం మైనార్టీ నేత షరీఫ్ తమ అనుచరులతో తెలుగుదేశంలో చేరడం చాలా సంతోషమని,మున్సిపల్ ఎన్నికలలో వారి సహకారంతో పార్టీ గెలుపుకు దోహదపడుతుందని, వారి చేరికతో పార్టీలో మరింత బలం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు నెట్టెం వెంకటేష్, తెదేపా కౌన్సిలర్లు బాబు నాయుడు,మార్పురి నాగార్జున బాబు, తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ మహాలక్ష్మి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనం

**పలమనేరు అక్టోబర్ 16 (మనసులో మాట) :**

గంగవరం మండలంలోని మేలుమాయి క్రాస్ లో వెలసియుండు శ్రీ శ్రీ శ్రీ మల్లాలమ్మ ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా 4వ రోజు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.పూజ కార్యక్రమాలు జరిపించిన వారు భారతి మహేష్, పద్మావతి ప్రభాకర్ నాయుడు, పుష్ప మల్లేష్, శశికళ వెంకటేష్, జమున కుమార్, అమల శ్రీధర్, సునీత వరద రాజులు, అలాగే భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దలు చంద్రప్ప,మునుస్వామి, శ్రీనివాసులు, రామచంద్ర, శ్రీకాంత్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, నారాయణ, శివ చానాల శ్రీనివాసులు, శంకర గౌరీ శంకర్, గణేష్, మహిళలు చిత్తూరు జిల్లా మేదర సంఘం అధ్యక్షులు వెంకటరమణ తదితరులు భక్తులు భారీ సంఖ్యలో పూజా కార్యక్రమాలలో పాల్గొనడం జరిగినదన్నారు.



# దుత్తలూరులో గంజాయి సాగుపై పోలీసుల మెరుపు దాడి

- **మొక్కజొన్న పంట మాటున 2 ఎకరాల్లో గంజాయి సాగు గుర్తింపు.. నలుగురు పట్టివేత**
- **డ్రోన్ సాయంతో అక్రమ సాగు గుట్టురట్టు.. అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌పై పోలీసుల దర్యాప్తు**





**నెల్లూరు, ప్రతినిధి, అక్టోబర్ 16, మనసులో మాట:**

దుత్తలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దుత్తలూరు గ్రామ శివారులో మొక్కజొన్న పంట మాటున సుమారు రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి పంటను డ్రోన్ సాంకేతికత సాయంతో గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, అక్రమ సాగు వెనుక ఉన్న వ్యక్తులు, ఆర్థిక వనరులు, సరఫరా నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్పీ డా అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు గంజాయి అక్రమ సాగుపై జిల్లా పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ నెల 15న దుత్తలూరు పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ అధికారుల సమక్షంలో తనిఖీలు చేపట్టారు. పోలీసు సిబ్బంది, ప్రత్యేక బృందం, రెవెన్యూ అధికారులు కలిసి గ్రామ శివారులోని సర్వే నంబర్ 1582 2లో ఉన్న వ్యవసాయ భూమిని పరిశీలించారు. సుమారు 9.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమిలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నట్లు తొలుత గుర్తించారు. అయితే డ్రోన్ ద్వారా పరిశీలించగా, మొక్కజొన్న పంట మధ్యలో సుమారు రెండు ఎకరాల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు బయటపడింది. గంజాయి మొక్కలకు డ్రిప్ విధానంలో నీటి సరఫరా ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. అనంతరం అధికారుల సమక్షంలో గంజాయి మొక్కలను తొలగించి తగులబెట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసు బృందం అక్కడికి చేరుకున్న సమయంలో కొందరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన సిబ్బంది నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి పంట విలువ కోట్ల రూపాయల్లో ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు సమాచారం.

**అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌పై ఆరా**

గంజాయి సాగు వెనుక ఇతర వ్యక్తుల ప్రమేయం, ఆర్థిక సహకారం, పంటను కొనుగోలు చేసేందుకు ముందస్తు ఒప్పందాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కొందరు వ్యక్తులు సాగుకు ఆర్థిక సహాయం అందించడం, మరికొందరు పంటను పరిశీలించడం, పంట చేతికి వచ్చిన తర్వాత కొనుగోలు చేసి సరఫరా చేసేందుకు ముందస్తుగా డబ్బులు చెల్లించడం వంటి అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. అదుపు లోకి తీసుకున్న వారిలో ఒకరు గతంలోనూ గంజాయి రవాణా, విక్రయాలకు సంబంధించిన వ్యవహారాల్లో పాల్గొన్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. పాత కేసుల వివరాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా చేసేందుకు జరిగినట్లు చెబుతున్న ఒప్పందాలను ధృవీకరిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం వెనుక ప్రధాన వ్యక్తులు ఎవరు, గంజాయి సరఫరా చేయాలనుకున్న ప్రాంతాలేవి, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ప్రమేయం ఉందా, అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

**గంజాయి అక్రమ వ్యాపారంపై కఠిన చర్యలు**

జిల్లాలో గంజాయి సాగు, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అక్రమ కార్యకలాపాలను గుర్తించాలని, సాగుదారు లతో పాటు వారికి ఆర్థిక సహకారం అందించేవారు, కొనుగోలుదారులు, సరఫరాదారులను కూడా గుర్తించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం యువత భవిష్యత్తుకు, సమాజ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, నిల్వ, రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.



# ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ పదవులకు పోటీ ఇచ్చేస్తాం

**ముత్తుకూరు. అక్టోబర్. (మనసులో మాట)**

మండలంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పనిసరిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడం జరుగుతుందని వైసీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తాళ్లపూడి లోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మంత్రి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ఆశీస్సులతో మండలంలోని ప్రతి ఎంపీటీసీ స్థానానికి, జడ్పిటిసి స్థానానికి, ప్రతి పంచాయతీ సర్పంచ్ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులను కచ్చితంగా పోటీలో నిలబెడతామని, అలాగే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే ధ్యేయంగా పనిచేస్తారని ఆయన తెలిపారు. అలాగే 17 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జడ్పిటిసి స్థానానికి, 20 పంచాయతీల సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక తమ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి నివాసంలో పంచాయతీలు వారీగా నాయకులతో కార్యకర్తలతో చర్చించి అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అయితే పంచాయతీలలో గాని, ఎంపిటిసి స్థానాలు కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు రాము అంగీకరించమని తప్పనిసరిగా తమ అభ్యర్థులను పోటీలు ఉంచి తీరుతామన్న రు. అలాగే అభ్యర్థులు నామినేషన్ సమయంలో సర్పంచికి గాని, ఎంపీటీసీ స్థానానికి గాని ,జడ్పిటిసి స్థానానికి గాని జరిగే నామినేషన్ల ప్రక్రియలు ఒక్కొక్క స్థానానికి తమ అభ్యర్థులను ముగ్గురు చొప్పున నామినేషన్ వేయిస్తామని ఆయన తెలిపారు. అలాగే ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపునకై కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఉన్నవాటిని ప్రచారంలో ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టిన తమ అభ్యర్థులు నాయకులు కార్యకర్తలు వాటిని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.



మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# స్థానిక ఎన్నికలకు 20 అంశాల్లో నోడల్ అధికారుల నియామకం



- **ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి**
- **కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**నెల్లూరు, ప్రతినిధి, అక్టోబర్ 16, మనసులో మాట:**
జిల్లాలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల 20 అంశాలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు నుంచి పోలింగ్ కేంద్రాల నిర్వహణ వరకు వివిధ కీలక బాధ్యతలను అధికారులకు అప్పగించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, శాంతిభద్రతలు, భద్రతా ప్రణాళిక, సిబ్బంది నియామకం, శిక్షణ, ఎన్నికల సామగ్రి ముద్రణ, రవాణా, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, పరిశీలకులకు సమాచారం అందించడం, మీడియా నిర్వహణ, కంప్యూటరీకరణ, ఫిర్యాదుల పరిష్కారం, వెబ్‌కాస్టింగ్, పోస్టల్ బ్యాలెట్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, ఓటర్ల జాబితాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలకు నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, శాంతి భద్రతలు, భద్రతా ప్రణాళికకు జిల్లా రెవెన్యూ అధికారి విజయ కుమార్, అదనపు ఎస్పీ సౌజన్యను నియమించారు. సిబ్బంది నిర్వహణ, యాదృచ్ఛిక ఎంపిక ప్రక్రియకు సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పరిశీలన, పంపిణీ బాధ్యతలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సన్నీ వంశీకృష్ణకు, రవాణా నిర్వహణను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి. చందర్‌కు అప్పగించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, పరిశీలకుల పర్యటనలు, కంప్యూటరీకరణ, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, సర్వీసు ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, ఓటర్ల జాబితాల పర్యవేక్షణ వంటి అంశాలకు కూడా సంబంధిత శాఖల అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. మీడియా, సమాచార నిర్వహణకు జిల్లా పౌరసంబంధాల అధికారి పి. వేణుగోపాల్ రెడ్డి, ఎన్నికల ఫిర్యాదుల పరిష్కారానికి చీఫ్ ప్లానింగ్ అధికారి టి లక్ష్మీ నరసింహులు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎన్నికలకు సంబంధించిన వార్తలు, పత్రికా కథనాల పర్యవేక్షణకు జిల్లా పౌరసంబంధాల అధికారితో పాటు జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి వెంకటలక్ష్మమ్మను నియమించారు. నియమితులైన నోడల్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించు కోవాలని కలెక్టర్ సూచించారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.. ఎస్సై

**వెంకటగిరి అక్టోబర్ 16 (మనసులో మాట ):**
వెంకటగిరి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నిబంధన కోడ్ ఉన్నందున ప్రజలు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్గొన రాదని వెంకటగిరి సబ్ ఇన్స్పెక్టర్ ఖాదర్‌బాషా తెలిపారు. 16 తేదీ నుండి నామినేషన్ లో ప్రక్రియ జరుగుతున్నందున ఎన్నికలు జరిగే పరిధిలో ఎక్కడ సభలో సమావేశాలు ఏర్పాటు చేయకూడదని సోషల్ మీడియాలో ఇరు పార్టీల రెచ్చగొట్టే వాక్యాలు పోస్ట్ చేయకూడదని అలా చేస్తే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లేనని పట్టణంలో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు.

# మత్స్య కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం

**ముత్తుకూరు. అక్టోబర్. (మనసులో మాట)**
విశాలాంధ్రముత్తుకూరు ముత్తుకూరు మత్స్య కళాశాలలో మత్స్య ఉత్పత్తుల ప్రాసెసింగ్ సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆహార భద్రత, పోషకాహార భద్రత, నూతన ఆవిష్కరణలు , సుస్థిర ఆహార వ్యవస్థల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమాన్ని మత్స్య ఉత్పత్తుల ప్రాసెసింగ్ సాంకేతిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సందీప్ నిర్వహించి, సభను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశల్లో భారతదేశం తీవ్రమైన ఆహార కొరతను, కరువులను ఎదుర్కొందని ఆయన వివరించారు. హరిత విప్లవం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరిగి, దేశ ఆహార భద్రత బలోపేతమైందని తెలిపారు. ప్రస్తుతం ఆహారం అందుబాటులో ఉండటమే కాకుండా, ప్రజలకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సూక్ష్మ పోషకాలు, ఖనిజ లవణాల లోపాలు వివిధ పోషకాహార సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని వివరించారు. భవిష్యత్ తరాలకు పోషకాహారాన్ని అందించేందుకు ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్, నిల్వ, సంరక్షణ మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో నూతన ఆవిష్కరణలకు




ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ ధన్వాల్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం శ్రేయస్సును మెరుగుపరచడంలో ఆహార భద్రత, పోషకాహార భద్రత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందుబాటులో ఉండేలా ఆహార ఉత్పత్తి, పంపిణీ, సంరక్షణ వ్యవస్థలను సమన్వయంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.మత్స్య ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్. మాధవన్ మాట్లాడుతూ, చేపలు ఇతర మత్స్య ఉత్పత్తుల నాణ్యతను కాపాడటంలో శీతల సరఫరా వ్యవస్థ (కోల్డ్ చైన్), మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు, సమర్థవంతమైన మార్కెట్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మత్స్య సంపద ద్వారా నాణ్యమైన ప్రోటీన్లు, అవసరమైన పోషకాలు లభిస్తాయని, ప్రజల పోషక భద్రతను పెంపొందించడంలో మత్స్య రంగం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ, నూతన ఆవిష్కరణలు మరియు పోషకాహార అభివృద్ధి ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాల్లో సానుకూల మార్పులను తీసుకురాగలవని తెలిపారు. మారుతున్న ఆహార, పోషకాహార అవసరాలకు అనుగుణంగా వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం (KVK), ఉండి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, చేపలు పోషక విలువలు కలిగిన ఆహార వనరులని, ప్రజల ఆహార నాణ్యతను మెరుగుపరచడంలో వాటి పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని ఆహార భద్రత, పోషకాహారం, మత్స్య రంగం ప్రాముఖ్యత సుస్థిర ఆహార వ్యవస్థల అభివృద్ధిపై అవగాహన పొందారు. కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ దయాకర్, డాక్టర్ జోష్నా, వసంత్ మరియు సందీప్ ఎస్. తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సరస్వతీ దేవి అలంకరణలో కొలువుదీరిన వాసవి మాత!

- **అమ్మవారి దివ్యరూపం కనులపండువ.. ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక శోభ**
- **శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తిపారవశ్యం.. దర్శనానికి తరలివచ్చిన భక్తులు**

**ముదిగుబ్బ అక్టోబర్ 16: (మనసులో మాట)**
శరన్నవరాత్రి ఉత్సవాలు ముదిగుబ్బ మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానానికి, విద్యకు, వివేకానికి ప్రతీకగా భావించే సరస్వతీ దేవి రూపంలో వాసవి మాత కొలువుదీరడంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో పులకించిపోయింది. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

**దివ్యాభరణాలతో అమ్మవారికి విశేష అలంకరణ!**
శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవి మాతను సరస్వతీ దేవి రూపంలో అత్యంత సుందరంగా అలంకరించారు. వివిధ రకాల దివ్యాభరణాలతో అమ్మవారికి చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సరస్వతీ దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారి దివ్యరూపం ఆలయానికి వచ్చిన భక్తులకు కనువిందు చేసింది. అమ్మవారి అలంకరణను చూసిన భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. తమ పిల్లలకు విద్యాబుద్ధులు, జ్ఞానవివేకాలు ప్రసాదించాలని, కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.

**తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు**
శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దేవస్థానంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించి, కలశారాధన, స్వస్తి పుణ్యాహవాచనం, గోపూజ, నవగ్రహ మండపారాధన తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలతో విశేషంగా ఆరాధించారు. వేదమంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజల అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి సమర్పించారు.

**అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు**
సరస్వతీ దేవి అలంకరణలో వాసవి మాత దర్శనమిస్తున్నారన్న సమాచారంతో భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. శరన్నవరాత్రి వేడుకలతో ఆలయంలో నెలకొన్న భక్తిమయ వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి కృపాకటాక్షాలు తమ కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని, సకల శుభాలు కలగాలని భక్తులు మనసారా ప్రార్థించారు.

**ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకగా శరన్నవరాత్రి వేడుకలు**
శరన్నవరాత్రి ఉత్సవాల్లో రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరించి పూజించడం హిందూ సంప్రదాయంలో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రతి అలంకరణ వెనుక ఉన్న దైవతత్వాన్ని స్మరించుకుంటూ భక్తులు అమ్మవారిని ఆరాధిస్తున్నారు. ఈ క్రమంలో సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాత భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, నవరాత్రి వేడుకలు భక్తుల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను మరింత పెంపొందిస్తున్నాయి.



KANCHARLA మనసులోమాట

# జనసేనలోకి 200 కుటుంబాలు చేరిక

- అతికారి కృష్ణ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువత, కుటుంబాలు
- పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనం: జనసేన నేతలు





**రాజంపేట (మనసులో మాట ప్రతినిధి) అక్టోబర్ 16:**
జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వానికి ఆకర్షితులై రాజంపేటలో 200 కుటుంబాలు పార్టీలో చేరాయి. రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్, సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. 22వ వార్డుకు చెందిన తోట వెంకట్, ఎల్.వి. ప్రసాద్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు తమ మద్దతుదారులు, కుటుంబ సభ్యులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. రాజంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు అతికారి కృష్ణ క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు స్థానికంగా పార్టీని విస్తరించేందుకు ఆయన చేస్తున్న కృషికి ఈ చేరికలు మరింత బలాన్ని చేకూర్చాయి. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, అందుకు ఈ చేరికలే నిదర్శనమని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో యువత, కుటుంబాలు స్వచ్ఛందంగా జనసేన పార్టీలో చేరడం సంతోషకరమని అన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో రాజంపేట నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవస్ నరసింహ, కోరముట్ల హరి, ఒంటిమిట్ట సింగిల్ విండో చైర్మన్ జయకృష్ణ, సిద్ధవటం ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్, సురేంద్ర, నరేష్, మల్లెం సుబ్బయ్య, గిరీష్, గంగయ్య, బాబీ, సునీల్, అతికారి చిన్న వెంకటయ్య, మల్లి తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నామినేషన్ల అడ్డగింత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

- ఎన్నికల్లో పోటీ చేసే హక్కును అడ్డుకోవడం సరికాదు
- కూటమి నాయకుల తీరుపై రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి విమర్శ




**రాజంపేట (మనసులో మాట ప్రతినిధి) అక్టోబర్ 16:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులను అడ్డుకునేందుకు కూటమి నాయకులు ప్రయత్నించడం దుర్మార్గపు చర్య అని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి విమర్శించారు. రాజంపేటలో గత 50 ఏళ్లలో ఎన్నడూ చూడని రాజకీయ సంస్కృతి ప్రస్తుతం కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.శుక్రవారం రాజంపేటలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రాజంపేట మున్సిపాలిటీలో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులను కూటమి నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనూ చిన్నచిన్న ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగానే జరిగాయని పేర్కొన్నారు. నామినేషన్లు వేయకుండా అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కొని వెనక్కి పంపించడం వంటి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ అని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అభ్యర్థికి రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కు అని, ఆ హక్కుకు ఆటంకం కలిగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్న వంద శాతం విజయమంటే ఇదేనా? అని మేడా రఘునాథరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగేందుకు ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఎవరికి నచ్చిన అభ్యర్థులు వారు పోటీ చేసే స్వేచ్ఛ ఉండాలని, నామినేషన్ల దశలోనే అడ్డంకులు సృష్టించడం సరికాదని అన్నారు. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో తగిన సమాధానం చెబుతారని మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు.

# మొదటిరోజు బోనీ కానీ నామినేషన్లు..



**వెంకటగిరి అక్టోబర్ 16 (మనసులో మాట ):**
స్థానిక సంస్థ ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ 16 తేదీ నుండి ప్రారంభమైంది. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో 36వార్డులు అభ్యర్థుల నామినేషన్లు వేయాల్సి ఉన్న శుక్రవారం రోజు మొదటి రోజు కావడం నామినేషన్ ఒకటి కూడా కాలేదని ఎన్నికల అధికారులు తెలియజేశారు. వెంకటగిరి పట్టణంలో మూడు ప్రాంతాల్లో నామినేషన్లు వేయడానికి ఏర్పాటు చేయడం జరిగిందని 1. మున్సిపల్ కార్యాలయం నందు 2. విస్వోదయ జూనియర్ కళాశాల 3. పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న,బాలికొన్నత పాఠశాలలో జరుగుతున్నాయన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ చట్టవిదంగా ప్రవర్తించాలని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



- తొలిరోజు నెల్లూరు మేయర్ స్థానానికి నిల్..
- వైఎస్సార్‌సీపీ తరఫున రెండు వార్డు నామినేషన్లు
- బుచ్చిరెడ్డిపాలెంలో చైర్‌పర్సన్ స్థానానికి ఒక నామినేషన్.. ఆత్మకూరులో నిల్

**నెల్లూరు, ప్రతినిధి, అక్టోబర్ 16, మనసులో మాట:**
జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు మున్సిపాలిటీ ల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. నగరపాలక సంస్థ మేయర్ స్థానానికి తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అయితే, కార్పొరేషన్ పరిధిలోని వార్డులకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ లో చైర్‌పర్సన్ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒక నామినేషన్, వార్డులకు సంబంధించి మరో నామినేషన్ దాఖలైంది. ఆత్మకూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ స్థానానికి, వార్డులకు సంబంధించి తొలిరోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

**ఎన్నికల సమాచారానికి ప్రత్యేక టోల్‌ఫ్రీ సదుపాయం**

స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రజలకు సందేహాలు, ఫిర్యాదులు, ఇతర సమాచారాన్ని అందించేందుకు నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ప్రత్యేక టోల్‌ఫ్రీ వ్యవస్థను అందుబాటులో ఉంచినట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ వైఓ నందన్ శుక్రవారం తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం కోసం ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1113తో పాటు ల్యాండ్‌లైన్ నంబర్లు 0861 2316777, 0861 2356777లను సంప్రదించ వచ్చని సూచించారు. అలాగే వాట్సాప్ ద్వారా 94940 18118 నంబర్‌కు సందేశాలు పంపి ఎన్నికలకు సంబంధించిన సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు.

# తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు

- తొలిరోజు మేయర్ స్థానానికి ఒకటి
- కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్ల దాఖలు
- మేయర్ అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ తరపున నీరుగట్టు నగేష్ నామినేషన్

**తిరుపతి బ్యూరో, అక్టోబరు 16 (మనసులో మాట) :**
తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ తొలిరోజైన శుక్రవారం మేయర్ స్థానానికి ఒక నామినేషన్, కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్ స్థానానికి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా నీరుగట్టు నగేష్ నామినేషన్ దాఖలు చేశారు.

కార్పొరేటర్ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీలు, ఇతర అభ్యర్థుల నుంచి మొత్తం 88 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీలు, ఇతరుల వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి: తెలుగుదేశం పార్టీ - 10, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ - 61, జనసేన పార్టీ - 4, సీపీఐ - 1, ఇతరులు - 12. తొలిరోజు మేయర్, కార్పొరేటర్ స్థానాలకు కలిపి మొత్తం 89 నామినేషన్లు దాఖలయ్యాయి.

# ముదిగుబ్బలో టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం!



- పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం ప్రారంభం.. స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తల సమావేశం

**ముదిగుబ్బ, అక్టోబర్ 16: (మనసులో మాట)**

ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ముదిగుబ్బ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముదిగుబ్బ మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన కార్యాచరణ, గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ పార్టీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమావేశాలు నిర్వహించేందుకు, ప్రజల సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక వేదికగా ఉపయోగపడనుంది. పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై ఈ సమావేశం దృష్టి సారించింది. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చైర్ పర్సన్ వైసీపీ అభ్యర్థిగా దివ్వెన దివ్య



**వెంకటగిరి అక్టోబర్ 16 (మనసులో మాట ):**

ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికలు నగర ప్రై గడంతో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు తక్కువ సమయం కావడం వలన అధికార పార్టీ అభ్యర్థులను ఖరారు చేయలేక అవస్థలు పడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడకక్కడ అభ్యర్థుల ఖరారు చేస్తూ ముందుకు పోతుంది. అందులో భాగంగా వెంకటగిరి మున్సిపల్ చైర్ పర్సన్ గా వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా బొలిగల దీవెన (దివ్య) వ్యాపారవేత్త ను ఖరార్ చేస్తూ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి బంగ్లానందు మీడియా సమావేశం లో మేము సిద్ధం అంటూ ప్రకటించారు. చైర్పర్సన్ అభ్యర్థి బోలిగల మస్తాన్ యాదవ్ సతీమణికావడం గతంలో తెలుగుదేశంపార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థత్వాన్ని ఆశించడం అది అందకపోవడంతో వైసీపీ పార్టీలో చేరడం మున్సిపల్ ఎలక్షన్ కి కాస్త కలిసి వచ్చిందని అంటున్నారు ప్రజలు. వైయస్ఆర్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల తో రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మంచి మెజార్టీతో గెలిపిస్తామంటూ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి హర్ష భవాని వ్యక్తం చేస్తున్నారు.

# నెల్లూరు కార్పొరేషన్‌లో కూటమి క్లీన్‌స్వీప్ ఖాయం

- వైసీపీ అరాచకాలకు పాల్పడితే సహించేది లేదు.. టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

**నెల్లూరు, ప్రతినిధి, అక్టోబర్ 16, మనసులో మాట:**

గత వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిన్నదని, అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వైసీపీ అధినేత జగన్ వ్యవహరిస్తున్నారని కోటంరెడ్డి ఆరోపించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను రెండేళ్లపాటు వాయిదా వేసిందని, ఇప్పుడు కూడా ఎన్నికలను అడ్డుకునేందుకు కోర్టులను ఆశ్రయించిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల తొలిరోజే పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో వైసీపీ శ్రేణులు అరాచకాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, కొట్టుకుంటూ, తొక్కుకుంటూ పోవాలనే ధోరణి ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. వైసీపీ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని సవాల్ విసిరారు. స్థానిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజల మద్దతు లేదని, ఒకటిరెండు చోట్ల గెలిచినా ఆ పార్టీకి రాజకీయంగా ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. ఐటీడీపీకి చెందిన



వ్యక్తులను వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని కోటంరెడ్డి ఆరోపించారు. ఇప్పటికీ అధికారంలో ఉన్నామనే భావనతో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారా అని ప్రశ్నించారు. బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధిస్తుందని కోటంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కూటమి మేయర్ అభ్యర్థి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని, మొత్తం 72 డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధిస్తారని అంచనా వేశారు. నెల్లూరులో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం లో వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలకు పాల్పడితే టీడీపీ కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, వారికి తాను అండగా ఉంటానని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి భరోసా ఇచ్చారు

# నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమే వైసీపీ రాజకీయమా?

- టీడీపీ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండించిన డాక్టర్ పనబాక లక్ష్మి
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్యలను సహించేది లేదు..
- దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లిన తెలుగుదేశం పార్టీ నాయకులపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడిన ఘటనపై తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు, మాజీ మంత్రి డాక్టర్ పనబాక లక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ప్రతి అభ్యర్థికి ఉన్న ప్రజాస్వామ్య హక్కు అని, అటువంటి హక్కును వినియోగించుకునేందుకు వెళ్తున్న నాయకులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడమేనని ఆమె మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి రాజకీయంగా పైచేయి సాధించాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదని స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని, నామినేషన్ల దశలోనే దాడులు, బెదిరింపులకు పాల్పడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పోరాటం ప్రజల మధ్య జరగాలి తప్ప, దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపుల ద్వారా ప్రత్యర్థులను అణచివేయాలనే ధోరణి ఉండకూడదని హితవు పలికారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించాలని, ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం అధికార యంత్రాంగం బాధ్యత అని, ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ప్రయత్నాలను తెలుగుదేశం పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు సంబంధిత అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని డాక్టర్ పనబాక లక్ష్మి కోరారు. ఈ ఘటనను తిరుపతి పార్లమెంట్ అబ్జర్వర్ నుకసాని బాలాజీ, తిరుపతి నియోజకవర్గ అబ్జర్వర్ పర్వీన్ తాజ్ కూడా తీవ్రంగా ఖండించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అభ్యర్థులు స్వేచ్ఛగా తమ నామినేషన్లు దాఖలు చేసుకునేలా తగిన భద్రత కల్పించాలని వారు కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, దాడులు, బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి రేవతి, తిరుపతి పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రూపేష్ వర్మ పాల్గొన్నారు.



# వైఎస్సార్‌సీపీకి మరో షాక్.. టీడీపీలోకి సన్నపురెడ్డి సోదరులు!

- **మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరికకు నిర్ణయం**



**నెల్లూరు, ప్రతినిధి, అక్టోబర్ 16, మనసులో మాట:**

జిల్లాలో వైఎస్సార్‌సీపీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ప్రముఖ నేతలు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డితో పాటు మంచికంటి శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సన్నపురెడ్డి సోదరులు వైఎస్సార్‌సీపీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలపై అసంతృప్తితో పార్టీని వీడాలని నిర్ణయించినట్లు తెలిపారు. అభివృద్ధికి మద్దతుగా అధికార టీడీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. సన్నపురెడ్డి సోదరుల కార్యాలయానికి రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సుబ్బారెడ్డి, మంచికంటి శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరాలని నిర్ణయించుకోవడం శుభపరిణామమని అన్నారు. వారి చేరిక పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సన్నపురెడ్డి సోదరులకు నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో మంచి ప్రజాదరణ, రాజకీయ పలుకుబడి ఉన్నాయని తెలిపారు. వారు ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో, అంకితభావం తో పనిచేసే నాయకులని పేర్కొన్నారు. వీరితో పాటు మంచికంటి శ్రీనివాసులు కూడా వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి మంత్రి నారాయణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతుండటం సంతోషకరమన్నారు. ఈ నెల 17న వారు అధికారికంగా తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు. సన్నపురెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో మమేకమై, అంకితభావంతో పనిచేసిన తమను పార్టీ నాయకత్వం విస్మరించిందని ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. మరోవైపు, నెల్లూరు నగర, రూరల్ ప్రాంతాల్లో రాజకీయంగా ప్రాధాన్యం ఉన్న నేతలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరాలని నిర్ణయించుకోవడం ఆ పార్టీకి నష్టదాయకంగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ పరిణామం మరింత తోడవుతుందా అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# ప్రజలకు ఆశ చూపి మోసం చేయడం చంద్రబాబుకు మామూలే... నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



- **కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో నే మా ప్రచార ఆయుధం**

**వెంకటగిరి అక్టోబర్ 16 (మనసులో మాట):**

ప్రజలకు ఆశ చూపి మోసం చేయడం చంద్రబాబు నైజం అని వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కుమార్ రెడ్డి శుక్రవారం నేరమల్లి జనార్ధన్ రెడ్డి బంగ్లాలో పాత్రికేయల సమావేశంలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక పథకాలను వేరగాచూపి గెలిచిన తర్వాత దాటవేసిందని,ఎన్నికల ముందు వారు చెప్పిన మేనిఫెస్టో నే స్థానిక ఎన్నికలలో ప్రచారంలో మేము ఆయుధంగా మలుచుకుంటామంటూ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు 1500 రూపాయలు ఇస్తామని చెప్పి ఇచ్చారా..? కొత్త పెన్షన్లు ఇచ్చారా.. అంటూ ప్రజలకు ఆశ చెప్పడం తప్ప నెరవేర్చే పరిస్థితి ఈ కూటమి ప్రభుత్వానికి లేదని అన్నారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అని చెప్పే చంద్రబాబు నాయుడు గతంలో స్థానిక ఎన్నికలను జరిపిన పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రజలు మన వైపు ఉన్నారంటూ స్థానిక ఎన్నికలు జరుపుతున్నారని, ప్రజలు మా వైపు ఉన్నారని అందుకే 25 వార్డులు ఉన్న వెంకటగిరి మున్సిపాలిటీని 36 వార్డులుగా చేసిన పోటీ చేయడానికి అభ్యర్థులు పోటీ పడుతూ మా వైపు వస్తున్నారని గతంలో మా అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన పథకాలు వలన ప్రజలు దీవెనలు మా పార్టీకి నిండుగా ఉండాలని తెలియజేశారు. వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో వెంకటగిరి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దీవెన చైర్పర్సన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నామని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సేవ చేయడానికి మాకు అవకాశం కల్పించాలని పదవి ముఖ్యం కాదని ప్రజాసేవ కోసం చిన్న పెద్ద పదవి అనే తేడా లేకుండా ప్రజాసేవ కోసమే పని చేస్తామని అన్నారు. అధికార పార్టీకి చైర్పర్సన్ అభ్యర్థి ప్రకటించడానికి ఇబ్బంది పడుతున్నట్లు ఉందని అక్కడ అభ్యర్థి లెక్క పోవడంతో వైఎస్ఆర్సిపిలో ఉన్న వ్యక్తులనే టిడిపి ద్వారా చైర్పర్సన్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్నికల వైయస్సార్సిపి అబ్జర్వర్ కల్పనా రెడ్డి. చిట్టేటి హరికృష్ణ. గూడూరు వెంకటేశ్వర్లు, పుల్లూరు సదానంద రెడ్డి, కందాటి కళ్యాణి, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# చిరుజల్లుల మధ్య.. గోవింద నామస్మరణతో వైభవంగా శ్రీవారి గరుడసేవ



- **లక్ష్మీకాసుల మాలధారిగా గరుడ వాహనంపై శ్రీనివాసుడు దివ్య దర్శనం**
- **వర్షాన్నిసైతం లెక్కచేయకుండా గంటల తరబడి వేచి ఉన్న వేలాది భక్తులు**

**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై లక్ష్మీకాసుల మాల ధారిగా మలయప్పస్వామివారు భక్తులకు అభయమిచ్చారు.

రాత్రి 6.30 గంటలకు ప్రారంభమైన వాహనసేవలో స్వామివారు నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు. గజరాజుల గంభీర నడక, మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోషల నడుమ సాగిన గరుడసేవ భక్తులను పరవశింపజేసింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణతో తిరుమల క్షేత్రాన్ని మార్మోగించారు.

**వర్షంలోనూ తరగని భక్తిభావం**

మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు గంటల తరబడి వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, బాదంపాలు, అల్పాహారం, బిస్కెట్ ప్యాకెట్లు అందించింది. వర్షంలోనూ అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**గరుడ వాహనసేవ.. భక్తి, జ్ఞాన వైరాగ్యాలకు ప్రతీక**

వైష్ణవ సంప్రదాయంలో గరుడ వాహనసేవకు విశిష్టమైన ప్రాధాన్యం ఉంది. భగవంతునికి పరమ భక్తుడైన గరుడాళ్వారిపై స్వామివారు విహరించడం భక్తి, శరణాగతికి ప్రతీకగా నిలుస్తుంది. గరుడుని దర్శనం సర్వపాప ప్రక్షాళనకు, జ్ఞాన వైరాగ్య ప్రాప్తికి మార్గమని పురాణాలు తెలియజేస్తున్నాయి. గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవారిని దర్శించుకోవడం తమ జన్మ ధన్యమైనట్లుగా భక్తులు భావిస్తారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





## స్థానిక ఎన్నికల వేళ.. రిటర్నింగ్ ఆఫీసర్ కేంద్రాల పరిశీలన




- **భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు టౌన్ ఏఎస్పీ దీక్ష సూచనలు**

**నెల్లూరు, ప్రతినిధి, అక్టోబర్ 16, మనసులో మాట:**
జిల్లాలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు టౌన్ సబ్ డివిజన్ పరిధిలోని రిటర్నింగ్ ఆఫీసర్ కేంద్రాలను టౌన్ ఏఎస్పీ దీక్ష శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకు చంగన్న మున్సిపల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ కేంద్రంతో పాటు, సంతపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని 62వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎస్పీ సూచించారు. రిటర్నింగ్ ఆఫీసర్ కేంద్రాల వద్ద శాంతిభద్రత లకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు యంత్రాంగం సమర్థవంతం గా పనిచేయాలని దీక్ష సూచించారు. ఈ పరిశీలన లో చిన్న బజార్, సంతపేట పోలీస్ స్టేషన్ల సీఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి కూటమి మేయర్ అభ్యర్థిగా జెబి శ్రీనివాస్

**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**
తిరుపతి కార్పొరేషన్ మేయర్ స్థానానికి కూటమి పార్టీల తరఫున అభ్యర్థిగా తిరుపతికి చెందిన టిడిపి నాయకులు మన్నె శ్రీనివాస ప్రసాద్ (జెబి శ్రీనివాస్) ను ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి నగర అధ్యక్షులుగా ఉన్న ఆయనపై పార్టీ అధిష్టానం నమ్మకం ఉంచింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నిప్పు పొందడంతో పాటు, తిరుపతిలో పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తించి మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేశారు. 1974 డిసెంబర్ 18న మన్నె కోటేశ్వరరావు, మన్నె రమాదేవి దంపతులకు జన్మించిన ఈయన, తిరుపతి టీపీఎం హైస్కూల్లో హైస్కూల్ విద్య, ఎస్వి జూనియర్ కాలేజ్ లో ఇంటర్మీడియట్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం టిడిపి నగర అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. మేయర్ అభ్యర్థిగా ఎంపికైన జేబీ శ్రీనివాస్ ను పలువురు అభినందించారు.



# వైయస్సార్ పార్టీలో చేరిన జనసేన నాయకుడు

**వెంకటగిరి అక్టోబర్ 16 (మనసులో మాట ):**
జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం పది సంవత్సరాలు పనిచేశానని కనీస విలువలు లేని పార్టీలో ఉండడం ఉండలేక ఎస్సార్ పార్టీలో చేరానని జనసేన మాజీ నేత గూడూరు వెంకటేశ్వర్లు శుక్రవారం మీడియా సమావేశంలో తెలిపారు. ప్రజారాజ్యం పార్టీలో పని చేసి ఆ దెబ్బలు మనకు ముందే కొందరు జనసేన పార్టీలో చేరమని ప్రోత్సహించడంతో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు బాగుంటాయి అనే ఉద్దేశ్యంతో పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేసి పార్టీ ఇచ్చిన జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి న్యాయం చేస్తూ వెంకటగిరిలో గత స్థానిక ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్ గా, ఎంపిటీసీలుగా జడ్పిటిసి గా పోటీ కి అభ్యర్థులను నిలపడడం జరిగిందన్నారు. పార్టీ ఎదగలను



ఆకాంక్షిస్తూ ఉన్నతరణంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తులు మరో పార్టీలో చేరడంతో కొత్తగా వచ్చిన జిల్లా అధ్యక్షుడు పని విధానాలు సక్రమంగా లేక ఇక్కడ పరిస్థితులు అదే అతనికి చెప్పుకునే అవకాశం లేక పార్టీభివృద్ధికి ఎంత కష్టపడి పనిచేసిన ప్రయోజనం లేకపోవడంతో పార్టీ మారాల్సిన పరిస్థితి వచ్చింది అన్నారు. వైయస్సార్ పార్టీలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆహ్వానం పలకడం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు మరియు ఆయన పై నాకు నమ్మకం ఉండడంతో వైఎస్ఆర్ పార్టీ లో చేరారని పేర్కొన్నారు.

# నామినేషన్ల వేళ పుంగనూరులో టెన్షన్.. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య రాళ్ల దాడి

- **అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ**
- **నామినేషన్ల ప్రక్రియలో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు**
- **ఎంపీ మిథున్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందన్న వైసీపీ**
- **పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని అధికార పార్టీపై విపక్షం ఆరోపణ**



**రాయలసీమ బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట ):**
అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. అటు రాయచోటిలో వాహనాలకు నిప్పంటించారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ లోక్‌సభా పక్ష నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి పార్టీ అభ్యర్థులతో కలిసి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. టీడీపీ కార్యకర్తలు తమ కాన్వాయ్‌ను అడ్డుకుని, నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారని వైసీపీ ఆరోపించింది. కర్రలు, ఇనుప రాడ్లతో వాహనాలపై దాడి చేశారని, ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. ఈ ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి. ఈ దాడి తనపై జరిగిన హత్యాయత్నమని వైసీపీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ప్రక్రియను హింసతో అడ్డుకునేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, తమ అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించింది. ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని డిమాండ్ చేసింది. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, అభ్యర్థులకు భద్రత కల్పించి ప్రశాంతంగా నామినేషన్లు వేసేలా చూడాలని కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో నెలకొన్న రాజకీయ వైరం ఈ ఘర్షణతో మరోసారి బయటపడింది.

## బద్వేల్లో దారుణం.. పిల్లల ముందే భార్యను కత్తితో హతమార్చిన భర్త

**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**
బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డులో గల CSI చర్చి ఎదురుగా శుక్రవారం మధ్యాహ్నం దారుణ హత్య చోటుచేసుకుంది. కడపలోని విశ్వనాథపురానికి చెందిన సమ్మెట ప్రవల్లిక (28) హత్యకు గురైంది. భర్త సాయిబాబా తన భార్యను పిల్లల కళ్లెదుటే కత్తితో పొడిచి హతమార్చినట్లు సమాచారం. వీరిద్దరూ 2023లో పెద్దల ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం మనస్పర్థల కారణంగా కొంతకాలంగా విడిగా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# వైసీపీ దౌర్జన్యాలు చేస్తే తగిన గుణపాఠం తప్పదు..

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హెచ్చరిక
- గత జగన్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం దివాళా తీసింది
- అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారు
- కూటమి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం
- రాష్ట్రంలో దౌర్జన్యం చేయాలని జగన్ చూస్తున్నారు
- పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తే ఊరుకునేది లేదు
- నెల్లూరు కార్పొరేషన్ లో టీడీపీ కూటమి మేయర్ అభ్యర్థి లక్ష ఓట్ల మెజార్టీ తో గెలవబోతున్నారు



**నెల్లూరు జిల్లా బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట ):**
గత జగన్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం దివాళా తీసిందని, దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు... కూటమి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం విస్తృతంగా జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకి విఘాతం కలిగించాలని జగన్ ప్రయత్నిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎన్నికలు పెట్టకుండా వైసీపీ రెండేళ్లు అప్పట్లో వాయిదా వేసిందని, స్థానిక సంస్థల ఎన్నికలు అడ్డుకోవాలని కోర్టులని వైసీపీ ఆశ్రయించిందని శ్రీధర్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో దౌర్జన్యం చేయాలని జగన్ చూస్తున్నారని, పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో నామినేషన్ తొలిరోజే వైసీపీ అరాచకాలు చేసిందన్నారు. మిధున్ రెడ్డి వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని కొట్టుకుంటూ, తొక్కుకుంటూ పోవాలి అని అన్నాడని, పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తే ఊరుకునేది లేదనిరూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి... హెచ్చరించారు. నెల్లూరు కార్పొరేషన్ లో టీడీపీ కూటమి మేయర్ అభ్యర్థి లక్ష ఓట్ల మెజార్టీ తో గెలవబోతున్నారని, 72కి 72 డివిజన్లలో వందశాతం కార్పొరేటర్లు గెలవబోతున్నారని, రూరల్ లో వైసిపి దౌర్జన్యాలకి పాల్పడితే టీడీపీ కార్యకర్తలు ఎవరు భయపడవద్దని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చెప్పారు.

# అట్లూరులో వైఎస్సార్‌సీపీకి షాక్.. టీడీపీలోకి ముడమాల ప్రభాకర్ రెడ్డి!

**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**
బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలంలో వైఎస్సార్‌సీపీకి ఎదురుదెబ్బ తగిలింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముడమాల ప్రభాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, కడప డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు.కూటమి ప్రభుత్వ పాలనపై నమ్మకంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ప్రభాకర్ రెడ్డి తెలిపారు.బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం దిశగా సాగుతున్న అడుగులకు ఈ చేరిక మరింత బలాన్ని చేకూర్చిందని నాయకులు అన్నారు.







# బద్వేలు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ సమావేశం

**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**
బద్వేలు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై చర్చించారు.బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ శ్రీ డి.సి. గోవిందరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ , నియోజకవర్గ యువ నాయకుడు, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డిలు బద్వేలు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజల మద్దతు కూడగట్టడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ఐకమత్యంతో పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# చిత్తూరు జిల్లాలో వివిధ మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్ పదవులకు 3 నామినేషన్లు దాఖలు

- చిత్తూరు మేయర్ పదవికి ఈరోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు
- వార్డు మెంబర్లు 36 ఈరోజు నామినేషన్లు దాఖలు
- జిల్లా ఎన్నికల అధికారి

**చిత్తూరు అక్టోబర్, 16 (మనసులో మాట):**
చిత్తూరు జిల్లాలో పట్టణ స్థానిక . ఎన్నికలు-2026కు ఈరోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఉన్న వివిధ మున్సిపాలిటీలలో చైర్మన్ పదవుల కోసం 3 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలోని చిత్తూరు నగరపాలక సంస్థ, మేయర్ పదవి కోసం, కుప్పం, నగరి, పలమనేరు మున్సిపాలిటీల చైర్మన్లు మరియు వార్డు మెంబర్లు వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం మున్సిపాలిటీ: మొత్తం 32 వార్డులు ఉన్న కుప్పం మున్సిపాలిటీలో చైర్మన్ పదవికి 2 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ రెండు నామినేషన్లు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరపున నమోదయ్యాయి.

**వార్డ్ మెంబర్లు 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి**

నగరి మున్సిపాలిటీ: మొత్తం 40 వార్డులు ఉన్న నగరి మున్సిపాలిటీలో చైర్మన్ 1 నామినేషన్ దాఖలైంది.

**వార్డు మెంబర్లు 7**
నామినేషన్లు దాఖలు అయ్యాయి ఇది తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరపున నమోదైంది.

**చిత్తూరు నగరపాలక సంస్థ:**
మొత్తం 60 వార్డులు ఉన్న . వార్డు మెంబర్లు 15 నామినేషన్లు దాఖలు అయ్యాయి.చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో మేయర్ పదవికి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. పలమనేరు మున్సిపాలిటీ: మొత్తం 36 వార్డులు ఉన్న ఈరోజు వార్డు మెంబర్లు గా 3 నామినేషన్లు దాఖలు అయ్యాయి పలమనేరు మున్సిపాలిటీలో చైర్మన్ పదవికి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

**చిత్తూరు మేయర్ కు ఈరోజు ఎలాంటి నామినేషన్ అందలేదు**
కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ పదవికి రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి నగరి మున్సిపాలిటీకి చైర్మన్ పదవికి ఒక నామినేషన్ దాఖలయ్యింది పలమనేర్ నందు మున్సిపాలిటీ చైర్మన్ పదవికి ఈరోజు నామినేషన్లు అందలేదుచిత్తూరు నగరపాలక ఎన్నికల సెల్ నుండి జారీ

# గండి ఆంజనేయస్వామిని దర్శించుకున్న కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం కమిటీ



**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**
చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రంలో వెలసిన గండి ఆంజనేయ స్వామి వారిని కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వల్లంకొండ వెంకటరమణ, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ పత్తి వెంకట నరసింహారావు, జిల్లా ఉద్యోగుల సంఘం వైస్ చైర్మన్ పబ్బతి చక్రపాణి, జిల్లా వాణి విభాగం వైస్ చైర్మన్ కొలిశెట్టి వెంకటసుబ్బయ్య, స్టేట్ యువజన సంఘం సెక్రటరీ గాజులపల్లి లక్ష్మీ నరసింహ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బచ్చు సుధాకర్, మహిళా మండలి జిల్లా కోకన్వీనర్ ప్రతి వరలక్ష్మి, గౌరవ సలహాదారులు వల్లంకొండ ధనలక్ష్మి, జిల్లా జాయింట్ సెక్రటరీ పబ్బతి శ్రీదేవి, బైసాని సుమంత్, ఉరిమి నరసింహ తదితరులు పాల్గొన్నారు. వీరికి జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారులు బైరెశెట్టి బాల గంగాధర్, జిల్లా యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దొంతు సతీష్ లు శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం జిల్లా ప్రజలందరూ గండి ఆంజనేయస్వామి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా అధ్యక్షులు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

మనసులో మాట

# కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం సైనికుల్లా పనిచేయండి





- రేపు తిరుపతి మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తాం
- కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ మెంబర్, మాజీ శాసనసభ్యులు రాకేడ ఇలిజ ఉన్నముట్ల
- ఏపీసిసి ప్రధాన కార్యదర్శి, తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ ఈద సుధాకర్ రెడ్డి

**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**

రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పంచాయతీలు మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేయాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ మెంబర్, మాజీ శాసనసభ్యులు రాకేడ ఇలిజ ఉన్నముట్ల అలాగే ఏపీసిసి ప్రధాన కార్యదర్శి, తిరుపతి నియోజకవర్గ ఇన్నార్జ్ ఈద సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఎస్ ఎస్ కిడ్స్ ఫంక్షన్ హాల్ లో స్థానిక సంస్థల ఎన్నికల వినాహక సమావేశం తిరుపతి నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుకాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ మెంబర్, మాజీ శాసనసభ్యులు రాకేడ ఇలిజ ఉన్నముట్ల అలాగే ఏపీసిసి ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్ బాబు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమైన కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ఏపీలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతున్నాయని అన్నారు. 2029 లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని వారు చెప్పారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటీ చేయడానికి సిద్ధం కావాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని నిరూపించే ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ధైర్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాల గురవం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని చెప్పారు. ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి దిగుతున్న వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తిరుపతి నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గౌడపేరా చిట్టిబాబు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రారంభంలోనే అధికార ప్రతిపక్ష పార్టీలు తమ దౌర్జన్యాలకు తెరలిగాయని విమర్శించారు తిరుపతి పుంగనూరు రాయచోటిలో జరిగిన దౌర్జన్య కాండకు హింసకు ఈ రెండు పార్టీలే కారణమని విమర్శించారు అధికార బలంతో ఒకరు అధికారం కోసం మరొకరు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిని రేపు ప్రకటిస్తామని నామినేషన్లు వేయడానికి వెళ్లే అభ్యర్థులతో తిరుపతి నగర కమిటీ కూడా వెళ్లడం జరుగుతుందని ఎవరు అధైర్య పడాల్సిన పని లేదన్నారు. పిసిసి ఉపాధ్యక్షుడు, తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, తిరుపతి నగర కమిటీ మాజీ అధ్యక్షుడు యార్లపల్లి గోపి, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు అండ దండ కాంగ్రెస్ పార్టీ అన్నారు. తిరుపతి జిల్లాలో అధికార ప్రతిపక్ష పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని చెప్పారు. ప్రత్యామ్నాయం లేక కూటమి ప్రభుత్వం లేదా వైసీపీ వైపు ప్రజలు మొగ్గుతున్నారన్నారు. దీనిని ఆపాలంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్థానిక

# చెన్నూరులో నవదుర్గ అలంకారంలో అమ్మవారి ఊరేగింపు



- నవదుర్గలను దర్శించుకునేందుకు భారీగా చేరుకున్న మహిళలు

**చెన్నూరు ,మనసులో మాట ,అక్టోబర్ 16:**

చెన్నూరులో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయ వ్యవస్థాపకులు కీర్తిశేషులు గోమేతకం చంద్రమౌళీశ్వర స్వామి వారి కుటుంబ సభ్యులు గోమేతకం భరత్ భార్య సునీత కుటుంబ సభ్యులు ఆశీస్సులతో బింద సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి చెన్నూరు పెన్నా నది ఒడ్డున ఉన్న శివాలయం లో 9 నదుల జలాలు తొమ్మిది రకాల వేషధారణలో ఉన్న అమ్మవారు నవదుర్గల అలంకారంతో బిందెలపై అలంకరించి శివాలయం నుంచి చెన్నూరు పురవీధుల గుండా మేళ తాళాలతో బాణాసంచా పేలుస్తూ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయం వరకు కొనసాగింది, ఆలయంలో శ్రీ సరస్వతి దేవి అలంకారం ముందు బాగాన నవదుర్గల అలంకారాలను ఉంచి బింద సేవ నిర్వహించారు, ఉదయం అమ్మవారికి అభిషేక పూజలు కుంకుమార్చన అలంకరణ నిర్వహించారు, సాయంత్రం ఆరు గంటల నుంచి భక్తులను అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు అనుమతించారు, ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు,చెన్నూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ సరస్వతి దేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి బింద సేవలో కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్యుల ఇంటి నుంచి బిందెసేవ నిర్వహించారు, ఆలయం వద్ద భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు,

# పలమనేరు మున్సిపల్ ఎన్నికలు.. తొలిరోజు ప్రశాంతంగా నామినేషన్ల స్వీకరణ

- చైర్పర్సన్ స్థానానికి నిల్.. మూడు వార్డుల నుంచి నామినేషన్లు దాఖలు

**పలమనేరుఅక్టోబర్ 16 (మనసులో మాట):**

పలమనేరు మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా శుక్రవారం తొలిరోజు నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అధికారులు నామినేషన్లను స్వీకరించారు. మొదటి రోజు చైర్పర్సన్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. వార్డు కౌన్సిలర్ స్థానాలకు మూడు నామినేషన్లు అందాయి. 1వ వార్డ్ నుండి ఖాజా పీర్ తెలుగుదేశం పార్టీ (టిడిపి) నామినేషన్ పత్రాలు సమర్పించారు. 19వ వార్డు నుండి ఎం. నాగరాజు తెలుగుదేశం పార్టీ( టిడిపి) నామినేషన్లు సమర్పించారు. 21 వ వార్డు నుండి వైయస్సార్సీపి కెఎం నాగరాజు నామినేషన్ పత్రాలు సమర్పించడం జరిగింది. చైర్మన్ అభ్యర్థిగా ఎవరు నామినేషన్ వేయలేదన్నారు.నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ ధూడే ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. బారికేడ్లు, హెల్ప్డెస్కులు, సీసీ కెమెరాలు, ఇతర మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, నామినేషన్ కేంద్రం పరిసరాల్లో భద్రతను పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాల స్వీకరణ, పరిశీలనలో జాప్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నామినేషన్లను ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె. లోకేశ్వర వర్మతో పాటు రెవెన్యూ, పోలీసు అధికారులు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించారు.







# పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు

- కొల్లేటి వెంకటాద్రికి పీహెచ్డీ ( పి హెచ్ డి)



**పలమనేరు అక్టోబర్ 16 ( మనసులో మాట) :**

పలమనేరులోని ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర విభాగ అధ్యాపకుడు కొల్లేటి వెంకటాద్రి జేఎన్టీయూ అనంతపురం (జె ఎన్ టి యు ఏ) నుండి డాక్టరేట్ (పీహెచ్డీ) పట్టా సాధించారు. ఆయన డాక్టర్ డి.జరీనా పర్యవేక్షణలో "స్టడీస్ ఆఫ్ స్ట్రక్చరల్, ఆప్టికల్, మాగ్నెటిక్ అండ్ డైఎలెక్ట్రిక్ ప్రాపర్టీస్ ఆఫ్ వైప్ యి 3 అండ్ $Sr_2Bi_4Ti_5O_{18}$ అండ్ $ZnSnO_3$ ఆక్సైడ్స్" అనే అంశంపై సమగ్ర పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు ఆయనకు పీహెచ్డీ డిగ్రీ ప్రదానం చేసినట్లు జేఎన్టీయూఏ పరీక్షల నియంత్రణ అధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) అధికారికంగా ప్రకటించారు. పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించిన కొల్లేటి వెంకటాద్రిని ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశులు, అధ్యాపక బృందం ఘనంగా అభినందించారు.

# పేద ప్రజలకు పచ్చడి మేతుకులు... గతి

- నింగినంటుతున్న నిత్యావసరాలు
- ఎండు మిర్చి కిలో రూ.300 పైమాటే
- రూ.వందకు చేరువలో ఉల్లిపాయాలు
- బియ్యం, పప్పులు, వంట నూనెలు పైపైకే





**బాలాయపల్లి అక్టోబర్ 16 (మనుసులో మాట):-**

నిత్యావసరాల ధరలు నింగినంటుతున్నాయి వైనంతో పేదలకు పచ్చడి మేతుకులు శరణ్యం. ఒకవైపు ఉల్లి ధరలు ఇప్పటికే కిలో రూ.100కు సమీపించింది. మరో వైపు ఎండు మిరప కూడా సామాన్యులకు దడ పట్టిస్తోంది. బయట మార్కెట్లో మిర్చి ధర కిలో రూ.300 పైబడి భారంగా మారింది. కందిపప్పు నుంచి పామాయిల్ దాకా ప్రతి నిత్యావసర సరుకు ధరలు పైపైకి ఎగబాకు తుండటంతో ప్రజల బతుకుబండి ముందుకు సాగక సాగిలపడుతోంది. రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఈ ధరల మోతపై ప్రణాళికా శాఖ తాజాగా నివేదిక విడుదల చేసింది. గతేడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు పలు సరుకుల ధరల్లో పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది.

**భారీగా పెరిగిన ఎండు మిర్చి :-**

గ్రేడ్1 మిరపకాయల కిలో ధర తాజాగా 297.41గా రికార్డు అయింది. గతేడాది రూ.181.63తో పోలిస్తే ఏకంగా 115.78 శాతం ధర పెరిగింది. గ్రేడ్2 మిరపకాయల ధర ప్రస్తుతం కిలో రూ.265.72గా ఉండగా, గత నెలలో 259.01తో పోలిస్తే 2.59 శాతం, గతేడాది రూ.160.16గా ఉన్న ధరతో పోలిస్తే 105.56 శాతం పెరగడం గమనార్హం. అయితే బహిరంగ మార్కెట్లో కిలో రూ.300కు పైగానే అమ్ముతున్నారు. దీంతో వినియోగదారుడుపై మరింత భారం పడుతోంది.

**పెరుగుతున్న ఉల్లిపాయ ధరలు :-**

గ్రేడ్2 ఉల్లిపాయలు కిలో రూ.63.61గా ఉంది. ఆగస్టు 20న ఇదే ధర రూ.43.20గా ఉండగా, నెల వ్యవధిలో కిలోకు రూ.20.41 పెరిగింది. గతేడాది సెప్టెంబరు 20న కిలో రూ.25.71 ఉండగా, ఏడాది కాలంలో రూ.37.90, అంటే ఏకంగా 147.41 శాతం పెరుగుదల నమోదైనట్టు తేలింది. గ్రేడ్2 ఉల్లి ధర కూడా తాజాగా కిలో రూ.55.73గా ఉండగా, గత నెలలో రూ.36.58గా, గతేడాది రూ.20.89గా ఉండడం గమనార్హం. బయట మార్కెట్లో, చిన్న దుకాణాల్లో అయితే కిలో రూ.75 వరకు చేరిపోయింది.

**బియ్యం కిలో రూ 100 :-**

బియ్యం ధరల్లోనూ పెరుగుదల స్పష్టంగా నమోదైంది. గ్రేడ్1 సూపర్‌ఫైన్ బియ్యం కిలో ధర రూ.68.41గా ఉండగా, గత నెలలో రూ.66.18గా, గతేడాది రూ.60.04తో నమోదైంది. అంటే 8.37 శాతం పెరిగినట్టు తేలింది. గ్రేడ్2 ఫైన్ బియ్యం కిలో ధర 60.70గా ఉండగా, గత నెలతో పోలిస్తే 2.86 శాతం, గతేడాదితో పోలిస్తే 8.22 శాతం పెరిగింది. దుకాణాల్లో కిలో సూపర్ ఫైన్ బియ్యం 75 నుంచి 80 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో సింగిల్ పోలిష్ బియ్యం అంటూ కిలో వంద రూపాయలకు విక్రయిస్తుండడం గమనార్హం.

**వంట నూనెల ధరలూ పైపైకే :-**

వంట నూనెల ధరల్లోనూ పెరుగుదల నమోదైంది. పామాయిల్ లీటరు ధర ప్రస్తుతం 155.20గా ఉండగా, గత నెలలో 153.45గా, గతేడాది రూ.131.13గా ఉంది. అంటే 24.07 శాతం పెరిగింది. సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ లీటరు ధర 181.50గా నమోదైంది. గత నెల ధర 179.22తో పోలిస్తే 1.27 శాతం, గతేడాదితో పోలిస్తే 32.07 శాతం అధికంగా ఉంది. వేరుశెనగ నూనె లీటరు ధర 185.18గా ఉంది. గతేడాది రూ.159.71తో పోలిస్తే 25.47 శాతం పెరిగింది.

**పెరుగుతున్న పప్పులు :-**

గ్రేడ్1 కందిపప్పు కిలో రూ.135.41గా ఉంది. గతేడాది రూ.116.04గా ఉండగా, ఏడాది కాలంలో 19.37 శాతం పెరిగింది. గ్రేడ్2 కందిపప్పు కిలో రూ.124.28గా నమోదైంది. గతేడాదితో పోలిస్తే 18.55 శాతం పెరిగింది.

**ఫోటో:-నిత్యవసరాల వస్తువులు**

**ఫోటో:- పెరుగుతున్న నూనే**

# ఓటర్ల జాబితా సవరణకు గడువు పెంపు



- అక్టోబర్ 22 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారం
- 30న తుది ఓటర్ల జాబితా విడుదల
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

**చిత్తూరు, అక్టోబర్ 16 (మనసులో మాట):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారానికి గడువు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు 2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్టోబర్ 22 వరకు క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారానికి అవకాశం కల్పించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నోటీసుల ప్రక్రియ కూడా అప్పటివరకు కొనసాగుతుందన్నారు. అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు స్పష్టం చేశారు.ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలకు సైతం సవరించిన షెడ్యూల్ను లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

- ఎన్నికల కమిషన్ సూచనల మేరకే మీ విధులు నిర్వర్తించాలి
- జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు
- ఆర్వో హ్యాండ్ బుక్ లో ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి.
- జడ్పిటిసి, ఎంపిటిసి, ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు



**చిత్తూరు, అక్టోబర్ 16(మనసులో మాట):**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే ఎన్నికలను విధులు నిర్వహించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు పేర్కొన్నారు శుక్రవారం జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలోజడ్పిటిసి, ఎంపిటిసి, ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారుజిల్లా పరిషత్ సి ఇ ఓ రవికుమార్ నాయుడు గారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా అన్ని ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉన్నందున, ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారుఎన్నికల కమిషన్ నిర్దేశించిన సమయంలో అన్ని ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉన్నందున, ఎన్నికల విధుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ సి ఇ ఓ తెలిపారు.ఆర్వో హ్యాండ్ బుక్ లో ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి. ఎన్నికల సమయం నందు సొంత నిర్ణయాలు తీసుకొనకూడదు,ఆర్ఓ, ఏఆర్ఓ విధులుగా విధులు కేటాయించబడిన వారు ముందుగా మీకు కేటాయించబడిన డివిజ న్లలో ఓటర్ల నమోదు (ఎలెక్ట్రోరోల్), ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు మరియు పోలింగ్ స్టేషన్లను పరిశీలించి. అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆర్ఓ, ఏఆర్ఓలు ఎలెక్ట్రోరోల్స్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు డి యల్ డి ఓ రవికుమార్ గారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్ మరియు సౌందర్ రాజన్ అధికారులకు వివరించారు. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ సమయంలో పాటించాల్సిన విధివిధానాలు, నామినేషన్ పత్రాల పరిశీలన, అవసరమైన ధ్రువపత్రాల ధృవీకరణ, నామినేషన్ల తిరస్కరణకు సంబంధించిన నిబంధనలు, అభ్యర్థుల అర్హతలు తదితర అంశాలపై అధికారులకు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎన్నికల నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అభ్యర్థులు సమర్పించిన పత్రాలను జాగ్రత్తగా ధృవీకరించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్ పేర్కొన్నారు.



**ఈ కార్యక్రమంలో పాల్గొన్న**

చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు, డి ఆర్ డి ఎ పిడి శ్రీ దేవి, పిడి రవికుమార్, జిల్లా విద్య శాఖ డి ఇ ఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు & ఎంపీడీఓస్ మరియు రిటర్నింగ్ అధికారులు & సహాయక రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఎంఎల్ఏచే ఫైన్ టెక్ ల్యాబ్ ప్రారంభం



**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీ బైపాస్ సమీపంలో ఏర్పాటు చేసిన "ఫైన్ టెక్ ల్యాబ్ ప్రైవేట్ సంస్థను చంద్రగిరి ఎమ్మెల్యే పులువర్ధన్ నాని శుక్రవారం ప్రారంభించారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి పూర్ణకుంభంతో ఫైన్ టెక్ ల్యాబ్ సంస్థ మేనేజర్, సిబ్బంది, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి ఫైన్ టెక్ సంస్థ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫైన్ టెక్ ల్యాబ్ సంస్థ వివరాలను ఎమ్మెల్యేకి ఆ సంస్థ మేనేజర్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ నేటి ఆధునిక డిజిటల్ యుగానికి తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకు ఈ సంస్థ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో శిక్షణ అందించాలని మేనేజర్‌ను కోరారు. నిరుద్యోగ....నిర్మూలనే ధ్యేయంగా యువతకు కేవలం విద్యే కాకుండా, కార్పొరేట్ రంగానికి అవసరమైన ప్రాక్టికల్ నైపుణ్యాలను (ప్రాక్టికల్ స్కిల్స్) నేర్పించడంలో సంస్థ ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఈ సంస్థ ద్వారా చంద్రగిరి మండలం పరిధిలోని యువతి, యువకులకు ఉపాధి అవకాశాలలో తగిన ప్రాధాన్యత కల్పించాలని సంస్థ మేనేజర్ ను ఎమ్మెల్యే కోరారు. యువతకు ఉపాధి కల్పించే ఏ మంచి కార్యక్రమానికైనా తమవంతు పూర్తి సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ దివ్య తేజ



**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**

బద్వేలు పురపాలక సంఘ ఎన్నికల సంగ్రామంలో తెలుగుదేశం పార్టీ తొలి అడుగు వేసింది. మున్సిపాలిటీ చైర్మన్ పదవికి టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ దివ్య తేజ శుక్రవారం ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. బద్వేలు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, బద్వేలు అభివృద్ధికి, యువ నాయకత్వానికి డాక్టర్ దివ్య తేజ నిలువెత్తు నిదర్శనమని, ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గద్దగుంట ఎంపీటీసీ అభ్యర్థిగా గండవరం రమేష్ రెడ్డి

**తడ, అక్టోబర్ 16 (మనసులో మాట):**

తడ మండలం గద్దగుంట గ్రామ పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థిగా యువ నాయకుడు, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ గండవరం రమేష్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపుతోంది.తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు ఆదేశాల మేరకు, సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గండవరం రమేష్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు యువతకు, విద్యావంతులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ విధానంలో భాగంగా రమేష్ రెడ్డికి అవకాశం కల్పించారు.

**ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు:**



గండవరం రమేష్ రెడ్డి గద్దగుంట పంచాయతీ పరిధిలో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గ్రామంలోని ప్రధాన సమస్యలపై అవగాహన కలిగిన నాయకుడిగా, యువత, రైతులు, మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

**ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని**

పార్టీ అభ్యర్థి గండవరం రమేష్‌రెడ్డి తెలిపారు. గద్దగుంట పంచాయతీ అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే లక్ష్యంగా పని చేస్తానని ఆయన పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, గద్దగుంట పంచాయతీతో పాటు తడ మండలంలోని అన్ని పంచాయతీల్లో యువతకు పెద్దపీట వేస్తామని నియోజకవర్గ ఇంచార్జ్ డి. కిరణ్ కుమార్ తెలిపారు. గండవరం రమేష్ రెడ్డి వంటి యువ నాయకుడికి అవకాశం కల్పించడంతో గద్దగుంట పంచాయతీలో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

# మోహినీ అలంకారంలో జగన్మోహనాకారుడిగా మలయప్పస్వామి







- **భక్తులను కటాక్షించిన శ్రీకృష్ణుడు.. భక్తిభావంతో పరవశించిన తిరుమల**

**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శుక్రవారం ఉదయం మలయప్పస్వామివారు మోహినీ అవతారంలో సర్వాలంకార భూషితుడై, భక్తులకు జగన్మోహనాకారంలో దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి వారు అలంకృతులై భక్తులకు అభయమిచ్చారు. గజరాజులు ముందు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి పల్లకీసేవ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ శ్రీవారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

**మోహినీ అవతారం.. మాయామోహాల నుంచి విముక్తికి సందేశం**

మోహినీ అవతారం జగత్తును ఆవహించిన మాయామోహాలకు అతీతంగా భగవంతుని తత్త్వాన్ని గ్రహించాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. సమస్త జగత్తు భగవంతుని లీలా విలాసమని, ఆయన అనుగ్రహంతోనే మాయామోహాలను అధిగమించి ఆధ్యాత్మిక ఉన్నతిని పొందగలమనే తత్త్వాన్ని ఈ అవతారం చాటిచెబుతుంది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జానకీ దేవి, రంగశ్రీ, ఆనంద సాయి, దర్శన్, నరేష్ కుమార్, ఎన్. సదాశివరావు, జేఈవోలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తూకివాకంలో చెంచు క్రికెట్ క్లబ్ ప్రారంభం

**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట)**

ఆధునిక జీవనశైలిలో మానసిక ఒత్తిడిని అధిగమించడానికి,శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి చెన్నై జాతీయ రహదారి సమీపంలోని తూకివాకం గ్రామంలో నూతనంగా నిర్మించిన 'చెంచు క్రికెట్ క్లబ్ మైదానాన్ని తుడా ఛైర్మన్,తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల సరిహద్దుల్లో ఇలాంటి అత్యాధునిక బాక్స్ క్రికెట్ సదుపాయాలు రావడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు తమ బిజీ షెడ్యూల్‌లో రోజుకు కొంత సమయం క్రీడలకు కేటాయించడం ద్వారా రోజంతా ఉల్లాసంగా ఉండవచ్చని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని, నాయకత్వ లక్షణాలను, సమష్టి కృషితో పనిచేసే తత్త్వాన్ని ఆటలు మాత్రమే నేర్పిస్తాయని చెప్పారు. క్రీడలు యువతను సన్మార్గంలో నడిపిస్తాయని, చెడు వ్యసనాలు, మొబైల్ గేమింగ్‌లకు బానిసలు కాకుండా మైదానంలో చెమటోడ్చి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని యువతకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్. రవి, కూటమి పార్టీల ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా ప్రముఖులు, క్రీడాకారులు, యువత పాల్గొన్నారు.



# మోహినీ అవతార వాహనసేవలో
## అలరించిన జాతీయ సాంస్కృతిక కళారూపాలు



- **8 రాష్ట్రాల నుంచి 16 కళాబృందాలు.. 451 మంది కళాకారుల ప్రదర్శనలు**

**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శుక్రవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారి మోహినీ అవతార వాహనసేవలో, వజాతీయ సాంస్కృతిక కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 16 కళాబృందాల్లోని 451 మంది కళాకారులు తిరుమాడ వీధుల్లో ప్రదర్శనలు ఇస్తూ భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పారు.

**భారతీయ జానపద కళల వైభవం**



ఉత్తరాఖండ్ కళాకారుల పర్వత ప్రాంత మహిళల వ్యవసాయ శ్రమను ప్రతిబింబించే జానపద నృత్యం, కర్ణాటక కళాకారుల మహిళా డొల్లుకుణిత, తెలంగాణ రాజ్ గోండ్ తెగ కళాకారుల గుస్సాడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తరప్రదేశ్ కళాకారుల కజరీ నృత్యం, శ్రీరాముడి వేషధారణలో ఆంధ్రప్రదేశ్ చిన్నారులు ప్రదర్శించిన రామాయణ ఘట్టాలు భక్తులను అలరించాయి. హర్యానా కళాకారుల సంప్రదాయ జానపద నృత్యాలు, మహారాష్ట్రతో పాటు కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహిళా కళాబృందాల డ్రమ్ విన్యాసాలు భక్తుల్లో ఉత్సాహాన్ని నింపాయి. శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి, గర్బా నృత్యరూపకాలతో మోహినీ అవతార వైభవాన్ని కళాత్మకంగా ఆవిష్కరించారు.

**నాలుగు కళాబృందాలకు ఈవో అభినందనలు**

మోహినీ అవతార వాహనసేవలో ప్రతిభ కనబరిచిన నాలుగు కళాబృందాలను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. గుజరాత్‌కు చెందిన అజిత్ త్యాగి బృందం గర్బా నృత్యం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పి. నాగబాబు బృందం గరగల్లు, ఉత్తర



ప్రదేశ్‌లోని వారణాసికి చెందిన కరంవీర్ సింగ్ బృందం కజరీ నృత్యం, కర్ణాటకకు చెందిన ఎస్. స్వప్న బృందం మహిళా డొల్లుకుణిత ప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకున్నాయి.

**భక్తి.. కళ.. సంస్కృతుల సంగమం**

వివిధ రాష్ట్రాల జానపద కళారూపాలు, సంప్రదాయ నృత్యాలు ఒకే వేదికపై ప్రదర్శితమవడంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత శోభాయమానమైంది. శ్రీవారి వాహనసేవలో భక్తితో పాటు భారతీయ సంస్కృతి వైవిధ్యాన్ని ఆస్వాదించే అరుదైన అవకాశాన్ని ఈ ప్రదర్శనలు భక్తులకు అందించాయి.



# బద్వేలు నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ



**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బద్వేలు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (RDO) / స్పెషల్ ఆఫీసర్, బద్వేలు మున్సిపాలిటీ ఎ. చంద్ర మోహన్ పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఎన్నికల నిబంధనల అమలు, నామినేషన్ పత్రాల స్వీకరణ మరియు సంబంధిత రికార్డుల నిర్వహణ తదితర అంశాలను RDO పరిశీలించారు.నామినేషన్ల ప్రక్రియను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని ఎన్నికల అధికారులకు సూచించారు.అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించే సమయంలో అవసరమైన పత్రాలు, అర్హతలు, ప్రతిపాదకుల వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, మీడియా ప్రతినిధులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బద్వేలు 18వ వార్డులో లకిడి ఇందిర నామినేషన్

**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**

బద్వేలు మున్సిపల్ ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ 18వ వార్డులో పోటీ ఆసక్తికరంగా మారింది.18వ వార్డు కౌన్సిలర్ పదవికి లకిడి ఇందిర నామినేషన్ దాఖలు చేయనున్నారు.స్థానికంగా మంచి పట్టు, ప్రజల్లో విశేష ఆదరణ ఉన్న ఆమె ఈసారి బరిలోకి దిగుతుండటంతో వార్డులో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.ఇప్పటికే ఆమె తన నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకొని, మద్దతుదారులు, కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ కార్యక్రమానికి సన్నద్ధమవుతున్నారు.18వ వార్డులో లకిడి ఇందిర పోటీ చేయడం ద్వారా గెలుపు ఖాయమని ఆమె అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# బద్వేలు రైతు బజార్‌ను సందర్శించిన రాష్ట్ర సీఈఓ మాధవీలత

**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**

బద్వేలు పట్టణంలోని రైతు బజార్‌ను రైతు బజార్ల రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణాధికారి మాధవిలత, ఐఏఎస్ శుక్రవారం పర్యటనలో భాగంగా సందర్శించారు.ఈ సందర్భంగా రైతు బజార్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, రైతులు, వ్యాపారులు మరియువినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా పొందుతున్న ప్రయోజనాలు, కల్పిస్తున్న సౌకర్యాలు, కూరగాయల విక్రయాలు, ధరల పరిస్థితిపై ఆరా తీశారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఆమె, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు రైతు బజార్ కార్యకలాపాలు సక్రమంగా



నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో RDO బద్వేలుఎ. చంద్ర మోహన్ , మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ , సంబంధిత అధికారులు, రైతు బజార్ సిబ్బంది, రైతులు మరియు వ్యాపారులు పాల్గొన్నారు.

# బద్వేలు మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల తనిఖీ




**బద్వేలు, మనసులో మాట, అక్టోబర్ 16:**

త్వరలో జరగనున్న బద్వేలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోనిమడకలవారిపల్లిలో గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలికలు) నందు ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి ఈరోజు అనగా 16.10.2026న RDO బద్వేలు చంద్ర మోహన్ , మైదుకూరు DSP రాజేంద్రప్రసాద్ సంయుక్తంగా తనిఖీ చేశారు.భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, విద్యుత్ సౌకర్యం, సిబ్బందికి అవసరమైన వసతులు తదితర అంశాలపై అధికారులు సమీక్షించారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ , గోపవరం తహసిల్దార్ జీవన్ చంద్రశేఖర్ , బద్వేల్ అర్బన్ CI రామకృష్ణ , SI జయరాములు , రెవెన్యూ మరియు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# గరుడసేవ ఏర్పాట్లను వేర్వేరుగా

## పరిశీలించిన టీటీడీ ఈవో, అదనపు ఈవో



- గ్యాలరీల్లో భక్తులకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి

**తిరుపతి బ్యూరో, అక్టోబర్ 16 (మనసులో మాట) :**

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవను పురస్కరించుకుని, గ్యాలరీల్లో భక్తులకు కల్పించిన సౌకర్యాలను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శుక్రవారం ఉదయం, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి మధ్యాహ్నం వేర్వేరుగా పరిశీలించారు. ప్రతి భక్తుడికి శ్రీవారి దర్శనం, వాహనసేవ వీక్షణం సౌకర్యవంతంగా ఉండేలా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఈవో, అదనపు ఈవో తెలిపారు. భక్తులకు ప్రణాళికాబద్ధంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ అందించడంతోపాటు పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకోగా, టీటీడీ ఏర్పాట్లపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అదనపు ఈవో వాహన మండపం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, పలువురు టీటీడీ అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు వెంటనే క్యాస్ట్, నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదు.
- రెవిన్యూ, మున్సిపల్ అధికారులకు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ వినతి.

**బద్వేలు , మనసులో మాట, అక్టోబర్ 16:**




బద్వేలు మున్సిపాలిటీ ఎన్నికల ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల కుల ధ్రువీకరణ మరియు మున్సిపాలిటి నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ల మంజూరులో ఉద్దేశపూర్వకంగానే అలసత్వంప్రదర్శిస్తున్నారని, తక్షణమే రెవెన్యూ డివిజనల్ అధికారి జోక్యం చేసుకొని నమోదు చేసుకున్న వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రమోహన్ రాజు డిమాండ్ చేశారు. ఈ విషయంపై వారి ఇరువురు సంయుక్తంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్, చంద్రమోహన్ రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బద్వేలు మున్సిపాలిటీలో వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ కూటమి అభ్యర్థులకు అనుకూలంగా జరిగిందని, ప్రస్తుతం నామినేషన్లు ప్రక్రియ మూడు రోజులు పాటు ఉన్నందున ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్ష వామపక్ష పార్టీల అభ్యర్థుల దృవీకరణ, నో డ్యూస్ పత్రాల మంజూరును ఉద్దేశపూర్వకంగానే నిలుపుదల చేయాలని ఈ ప్రాంత కూటమి నేతల నుంచి ఆదేశాలు అందాయని విమర్శలు ఘాటుగావినిపిస్తున్నాయని వారు ఆరోపించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని ఎవరికైనా ఎన్నికలలో పోటీ చేసే హక్కు ఉన్నదని, దానిని కాలు రాయడం కూటం నేతలకు తగదని వారికి వత్తాసు పలకడం కూడా అధికారులకు తగదని వారు దుయ్యబట్టారు. తక్షణమే ఎన్నికల అధికారులు స్పందించి అభ్యర్థులు నమోదు చేసుకున్న వెంటనే రెవిన్యూ నుండి కుల ధ్రువీకరణ, మున్సిపల్ అధికారుల నుండి నో డ్యూస్ సర్టిఫికెట్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకొని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను, ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను పాటించాలని వారు కోరారు.ఈ సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి చంద్రమోహన్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు, కే బాబు, సంజీవ్, మహబూబ్ బాషా, జైపాల్, చంద్రపాల్, వెంకటేష్, ఈశ్వర్, రాజేష్, నరసింహ మరియు సభ్యులు పాల్గొన్నారు

# చెన్నూరులో ఎన్నికల నియమావళి అమలుకు అధికారుల సమన్వయం ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు



**చెన్నూరు, మనసులో మాట,అక్టోబర్, 16,**

చెన్నూరు మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై అధికారులు సమన్వయంతో పని చేయాలని చెన్నూరు మండలం అభివృద్ధి అధికారి కిరణ్ మోహన్ రావు కోరారు, శుక్రవారం ఎంపీడీవో సభ వనంలో స్థానిక అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు,ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎం సి సి) అమలులో భాగంగా ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పనిచేయాలని , సమావేశంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం, నిబంధనల ఉల్లంఘనల నివారణ, సంబంధిత శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో చెన్నూరు మండల తహశీల్దార్ విజయ్ కుమారి ఏఎస్ఐ మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల పిడిఓలు పాల్గొన్నారు. బి. కిరణ్ మోహన్ రావు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, రాజకీయ నాయకుల ఫోటోలు, గోడ రాతలు తదితర ఎన్నికల ప్రచార సామగ్రి విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పిడిఓ లకు తెలిపారు.చెన్నూరు మండల తహశీల్దార్ విజయ కుమారి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రెవెన్యూ శాఖ అధికారులు తమ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును నిరంతరం పర్యవేక్షించాలని, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు.ఏ ఎస్ ఐ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎన్నికల ప్రచార సభలు, ఊరేగింపులు, లౌడ్‌స్పీకర్ల వినియోగం తదితర అంశాల్లో అమలులో ఉన్న నిబంధనలు, అనుమతుల విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే చర్యలు, ఓటర్లను ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం వంటి ఘటనలు గుర్తించినప్పుడు వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలని తెలిపారు,ప్రభుత్వ భవనాలు, బహిరంగ ఆస్తులపై ఉన్న రాజకీయ ప్రచార సామగ్రిని వర్తించే నిబంధనల ప్రకారం తొలగించడం. ప్రభుత్వ వాహనాలు, సిబ్బంది, ఇతర ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించకుండా చూడాలని కోరారు,కొత్త అభివృద్ధి పనులు, నిధుల విడుదల, ఆర్థిక సహాయాలు, శంకుస్థాపనలు తదితర అంశాల్లో ఎం సి సి నిబంధనలు పాటించాలని కోరారు,బహిరంగ సభలు, ఊరేగింపులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అవసరమైన అనుమతులు పొందాలన్నారు,పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ప్రచారం, ఎన్నికల సహాయ కేంద్రాల ఏర్పాటు, ప్రచార వాహనాల వినియోగంపై వర్తించే పరిమితులను పాటించాలని సూచించారు,ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణ స్పందనతో పాటు శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు,మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు.


SRI KANCHERLA ATCHUTA RAO
PROUDLY PRESENTS
SSLS CREATIONS
Yadha Kumar's
- VICTORY OVER ENEMIES
PRODUCER K. UPENDRA DIRECTOR YADHA KUMAR CO PRODUCERS K SUBBA LAKSHMI, K SUNITHA
GUNA SEKHARAN RAGHU KUNCHE SHYAM KUMAR .P PRASADULA MADHU BABU DRAGON PRAKASH RAJ KRISHNA
LOOKS RAJSEKHAR BALU UTTAR KUMAR CHANDU RAMESH SURYANARAYANA TRINADH BABU
K. JANARDHAN SURYA CHANDRA RAMANA PUSHYAMI SURYA PRAKASH RAO

మనసులోమాట




Box Office Cinema RNI NO: APTEL/2012/42168
Postal Regd No HD/1183/2022-2024
Posting Every Monday
Date of Publication 30-12-2024